సాక్షి
మంచిర్యాల
ఆదివారం, 20, ఆగస్టు, 2023



ఉపాధి లడ్డూ 8లో▸
ఐటీడీఏ కేంద్రంగా ఆదివాసీ మహిళలు ఇప్ప పువ్వు లడ్డూ తయారీతో ఉపాధి పొందుతున్నారు. భీంబాయి సంఘం పేరుతో ఆహార కేంద్రం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్నారు.

మద్యం వ్యాపారంలోకి మహిళలు

మంచిర్యాలక్రైం: మద్యం దుకాణాలకు పలువురు మహిళలూ టెండర్లు వేశారు. జిల్లాలోని 73 దుకాణాలకు 2,242 దరఖాస్తులు రాగా 398 మంది మహిళలు దరఖాస్తు సమర్పించారు. మంచిర్యాల డివిజన్‌లో 219, బెల్లంపల్లిలో 76, చెన్నూర్‌లో 54, లక్సెట్టిపేటలో 49 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్ తెలిపారు. 21న మంచిర్యాలలోని ఫంక్షన్ హాల్‌లో లక్కీడ్రా తీయనున్నట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
27.0 /24.0

వాతావరణం
ఉదయం వేళ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రతీరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

లక్సెట్టిపేట: విద్యార్థులు ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించిందని అన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకువాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, భోజనవసతి, అన్ని విషయాలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోధర, సెక్టోరియల్ అధికారులు చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం బీసీ గణన చేపట్టాలని బీసీ ఐక్య సంఘాల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం నుంచి నస్పూర్‌లోని కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల లెక్క తేలితే చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి వస్తుందన్న భావనతోనే కేంద్రం వెనుకడుగు వేస్తుందని విమర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు, న్యాయవాదులు కర్రె లచ్చన్న, సత్తయ్య, బీసీ నాయకులు గజెల్లి వెంకటయ్య, బోడంకి మహేష్, రాసమల్ల కుమార్, జైపాల్‌సింగ్, నార్ల మహేందర్, అరెందుల రాజేశం, నల్ల నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఆందోళన



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ శాశ్వత డంపింగ్‌యార్డు లేకపోవడం, హిందూ శ్మశాన వాటిక లేదని, వరద బాధితులకు నష్ట పరిహారం ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. వరదల నివారణ కోసం రాళ్లవాగుపై కరకట్ట నిర్మించాలని, రైల్వే అండర్‌బ్రిడ్జి సమస్య పరిష్కరించి టూటౌన్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ, ముదాం మల్లేశ్, పట్టి వెంకటకృష్ణ, అవిడపు రాజబాబు, అమిరిశెట్టి రాజు, కేశెట్టి నాగేశ్వర్‌రావు, పచ్చ వెంకటేశ్వర్లు, కుదురుపాక గంగన్న, బల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీఆర్పీల శిక్షణ

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో సీఆర్పీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు పెంపొందించాలని సెక్టోరల్ అధికారి చౌదరి అన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలన్నింటినీ క్షేత్రస్థాయిలో ఉపయోగించుకోవాలని, ప్రతీ విద్యార్థి రాయడం, చదవడంతో నైపుణ్యం సాధించేలా ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ సీఆర్పీలు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆఫీస్‌కు ‘ప్రగతి’ దారి!



కలెక్టరేట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు ఓ వెంచరు మధ్య నుంచి వేసిన తారు రోడ్డు

- కలెక్టరేట్ నుంచి కార్యాలయం వరకు..
- రూ.80లక్షలు వెచ్చించి తారు రోడ్డు
- పట్టణ ప్రగతి నిధులు వినియోగం
- ప్రైవేటు వెంచరు గుండా నిర్మాణం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాజు తలుచుకుంటే డబ్బులకు కొదువా అన్న చందంగా మారింది నస్పూర్ మున్సిపాల్టీలోని అభివృద్ధి పనుల పరిస్థితి. పట్టణాల అభివృద్ధి లక్ష్యంగా ఖర్చు చేయాల్సిన నిధులను ప్రజాప్రతినిధులు, నాయకులు తమకు అనుకూలమైన చోట వెచ్చిస్తున్నారు. ఇందుకోసం మున్సిపల్ పాలకవర్గాలు తీర్మానాలు చేసి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఏళ్లుగా కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్న చోట్ల మాత్రం నిధుల విడుదలకు జాప్యం చేస్తున్నారు.

ప్రైవేటు వెంచరుకు లబ్ధి

ఈ రోడ్డు పార్టీ కార్యాలయానికి రాకపోకలకు తప్ప వేరే వాళ్లకు పెద్దగా ఉపయోగం లేదు. ఇక ఆ రోడ్డు కూడా ఓ ప్రైవేటు వెంచరు గుండా వెళ్లడంతో ఆ ప్లాట్లకు డిమాండ్ పెరిగింది. అప్పటివరకు ఆ వెంచరుకు సరైన దారి కూడా లేదు. తారు రోడ్డు రావడంతో డిమాండ్ వచ్చింది. ప్రజల సొమ్ముతో ఖర్చు చేసి ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చినట్లు అయింది. అంతేకాక ఆ వెంచరులో ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగిందని అప్పట్లో ఫిర్యాదులు వచ్చాయి. అటు వైపు రోడ్డు లేదని, అప్పటి తహసీల్దార్ అభ్యంతరం చెప్పారు. దీంతో కొన్నాళ్లు వెంచరుకు దారి కూడా లేదు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంక్ ఉండడంతో అటు వైపు రోడ్డు అక్కడి వరకు వేశారు. కానీ తర్వాత వేసిన కొత్త రోడ్డు ఎక్కువగా ప్రైవేటు వెంచరు అభివృద్ధి కోసం, అటు పార్టీ కార్యాలయానికి రాకపోకలకే పనికి వచ్చేలా మారిపోయింది. ఇక పనిలో పనిగా పార్టీ కార్యాలయానికి వెళ్లే వరకు కూడా రోడ్డు వేశారు. కొత్త కలెక్టరేట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు వరకు రూ.20లక్షలతో డ్రెయిన్స్ నిర్మించాలని తీర్మానం చేశారు. ఈ డ్రెయినేజీలు విలేజ్‌నస్పూర్ వైపు నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు నిర్మించనున్నట్లు తెలిసింది. ఇక వెంచరు గుండా ప్రజాధనంతో రోడ్డు వేసినందుకు ఆ రియల్టర్ నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ టి.రమేశ్‌ను సంప్రదించగా.. పట్టణ ప్రగతి నిధులతోనే పదో వార్డులో శాశ్వత ప్రాతిపదికన రోడ్డు వేశామని తెలిపారు. కాగా, ఈ రోడ్డుపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

రూ.80లక్షలతో రోడ్డు

నస్పూర్ పట్టణంలో నిర్మించిన కొత్త సమీకృత కలెక్టరేట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు తాత్కాలిక రోడ్డు పేరుతో గత జూన్‌లో ఆగమేఘాల మీద తారు రోడ్డు వేశారు. ఇందుకోసం రూ.80లక్షలు ఖర్చు చేశారు. కేవలం 685మీటర్లు ఉన్న ఈ రోడ్డు కోసం చకచకా పనులు పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ కలెక్టరేట్ ప్రారంభించాక అటు నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్లేందుకు దారి కోసం రెండ్రోజుల్లోనే పూర్తి చేయడం గమనార్హం. ప్రస్తుతం ఆ దారి కొంతమందికే ఉపయోగపడుతోంది. అనేక కాలనీల్లో ఇప్పటికీ సరైన రోడ్లు, నాలాలు లేవు. ఇక్కడ మాత్రం రోడ్డు వేయడంపై పాలకవర్గంపై విమర్శలు వస్తున్నాయి.

ఓటు ద్వారా సమర్థులను ఎన్నుకోవాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- బెల్లంపల్లిలో 5కే రన్



రన్‌లో పాల్గొన్న కలెక్టర్, ఆర్డీవో, ఏసీపీ

బెల్లంపల్లి: ప్రజల చేతిలో ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కు ద్వారా సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం బెల్లంపల్లిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహనకు 5కే రన్ నిర్వహించారు. తిలక్‌స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ బజార్ ఏరియా మీదుగా ఏఎంసీ క్రీడా మైదానం వరకు సాగింది. కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్డీవో సురేష్, ఏసీపీ సదయ్య, క్రీడాకారులు, యువతీ, యువకులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు. ఏఎంసీ క్రీడామైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల్లో ఓటు వేయాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలు, ఆకర్షణలకు గురికాకుండా నిష్పక్షపాతంగా ఓటేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, కమిషనర్ సమ్మయ్య, సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పంటలకు ఊపిరి

- 20 రోజుల తర్వాత భారీ వర్షం
- జిల్లాలో 48.4 మిల్లీమీటర్ల నగటు వర్షపాతం
- ఎనిమిది మండలాల్లో అధికం



జైపూర్ మండలం కుందారంలో వరిపొలంలో వర్షపు నీరు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత నెల భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. ఈ నెలలో 20 రోజులుగా వర్షాలు కరువయ్యాయి. రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం నుంచి జిల్లాలో మళ్లీ భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం నుంచి శనివారం వరకు 48.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 20 రోజుల తర్వాత అన్ని మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఇన్ని రోజులు బోసినపోయిన వాగులు, వంకలకు మళ్లీ వరదలు పోటెత్తాయి. మెట్ట ప్రాంతాల్లో ఎండిపోతున్న పత్తి, కంది, వరి పంటలకు వర్షం ఊపిరి పోసినట్లయింది. గత కొద్ది రోజులుగా వర్షాలు లేక నారు పోసుకున్న రైతులు నాట్లు వేసుకోవడానికి వెనుకడుగు వేశారు. ఈ వర్షాలతో పంట పొలాల్లోకి నీరు చేరడంతో నాట్లు వేసుకుంటున్నారు. ఎనిమిది మండలాల్లో 50మిల్లీమీటర్ల నుంచి 80 మిల్లీమీటర్ల వరకు అధిక వర్షపాతం నమోదైంది. గత నెల 18 నుంచి 28వరకు ఎడతెరిపి లేని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆ తర్వాత నుంచి వాతావరణంలో మార్పుతో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. వర్షాల్లేక రైతులు గుబులు చెందుతున్న సమయంలో గత నెల మాదిరే 18 నుంచి మళ్లీ అన్ని గ్రామాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటలు జలకళ సంతరించుకుని కళకళలాడుతున్నాయి.

2.88 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఇప్పటివరకు 2,88,197 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధానంగా పత్తి పంట 1,57,717 ఎకరాలు, వరి 99,305 ఎకరాల్లో నాట్లు వేసుకోగా మరో 42 వేల ఎకరాల వరకు నారు పోసుకున్నారు. గత నెలలో పది రోజులపాటు ఎడతెరిపి లేని భారీ వర్షాలు, వరదలతో లోతట్టు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగి నష్టపోయారు. చెరువులు, కుంటలు, వివిధ జలాశయాల్లో భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో జలాశయాల కింద వరి సాగుకు నారు పోసుకున్నారు. వర్షాల విరామంతో పత్తి, కంది పంటల్లో కలుపు నివారణ, పంట ఎదిగేందుకు ఎరువులు వేసుకుంటూ వచ్చారు. గత కొద్ది రోజులుగా వర్షాలు లేకపోగా ఎండలు మండుతున్నాయి. నారు ముదిరిపోతున్నా నాట్లు వేసుకునేందుకు వెనుకడుగు వేశారు. మరోవైపు ఇప్పటికే నాట్లు వేసుకున్న రైతులు నీటితడి లేక నేల నెర్రెలు బారిపోతుండడంతో ఆందోళనకు గురయ్యారు. అల్పపీడన ప్రభావంతో మళ్లీ కురిసిన వర్షాలు పంటలకు జీవం పోశాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం..

మంచిర్యాల మండలంలో 84.1 మిల్లీమీటర్లు, నస్పూర్‌లో 78.1, జైపూర్‌లో 69.9, చెన్నూర్‌లో 68.2, మందమర్రిలో 65.1, భీమారంలో 58.2, కోటపల్లిలో 55.0, దండేపల్లిలో 50.6, వేమనపల్లిలో 49.1, జన్నారంలో 48.4, కాసిపేటలో 41.4, లక్సెట్టిపేటలో 38.3, హాజీపూర్‌లో 38.3, బెల్లంపల్లిలో 37.9, కన్నెపెల్లిలో 33.8, నెన్నెలలో 22.2, భీమినిలో 17.2, తాండూర్‌లో 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం జూన్ నుంచి ఇప్పటివరకు 665.7 మిల్లీమీటర్లు కాగా 713.3 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటున 7 శాతం అధికంగా నమోదైంది. ఐదు మండలాల్లో 20 నుంచి 35 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, 12 మండలాల్లో సాధారణ స్థాయి వర్షపాతం నమోదైంది. భీమిని మండలంలో మాత్రమే 27 శాతం లోటు వర్షపాతం నెలకొంది.

టీఎన్జీవోస్ సొసైటీ స్థలం రీ సర్వే

- మూడు శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడిగా..
- ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలు



టీఎన్‌జీఓస్ స్థలం

నస్పూర్: పట్టణ పరిధిలోని టీఎన్జీవోస్ సొసైటీ స్థలం రీ సర్వేకు అధికారులు సిద్ధమయ్యారు. కలెక్టర్ సూచన మేరకు ఈ నెల 15న అదనపు కలెక్టర్ మోతీలాల్ ఉత్తర్వులు జారీ చేశారు. నస్పూర్ శివారు 42సర్వేనంబరులో టీఎన్జీవో సొసైటీకి 2000లో అప్పటి ప్రభుత్వం 32 ఎకరాలు కేటాయించింది. ఈ స్థలంపై ఏళ్ల తరబడిగా వివాదాలు ముదురుతూనే ఉన్నాయి. పలు ఫిర్యాదుల నేపథ్యంలో మంచిర్యాల ఆర్డీవో రాములు, ఏడీ(సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) శ్రీనివాస్, మంచిర్యాల రూరల్ సీఐ టీ.సంజీవ్, నస్పూర్ మున్సిపల్ కమిషనర్ టీ.రమేశ్‌లతో కూడిన బృందాన్ని సర్వేకు నియమించారు. పకడ్బందీగా సర్వే చేసి 15రోజుల్లో సమగ్ర నివేదిక అందజేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఆక్రమణల నిగ్గు తేలేనా..!

వివాదాలు, కోర్టు కేసులు, పలు కారణాల వల్ల ఆ స్థలంలో చాలా ఏళ్ల వరకు టీఎన్జీవోలు నిర్మాణాలు చేపట్టలేదు. కోర్టు వివాదాలు తొలగడంతో పలువురు ఇళ్లు నిర్మించుకోగా చాలామంది నిర్మించుకోలేదు. ఈ స్థలం నస్పూర్ నడిబొడ్డున ఉండడం, కలెక్టరేట్‌కు అతి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో పలువురు ఆక్రమణదారులు, రైతులు స్థలం తమదంటూ, అసైన్డ్ అయిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొందరు టెంటు వేసుకుని రోజుల తరబడి నిరసనకు దిగారు. పలువురు మధ్యవర్తుల ద్వారా టీఎన్జీవో నాయకులు, రైతులకు మధ్య సయోధ్య కుదరడంతో ఈ మధ్య టీఎన్జీవోలు మళ్లీ ఇళ్ల నిర్మాణాలకు సిద్ధమయ్యారు. సుమారు 20 బోర్లు వేశారు. టీఎన్‌జీఓలకు కేటాయించిన స్థలం చాలా వరకు ఆక్రమణలకు గురైందని, బినామీలు ఉన్నారని, అందులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పెద్ద ఎత్తున కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి సర్వేకు ఆదేశాలు జారీ చేశారు. టీఎన్జీఓలకు కేటాయించిన స్థలం ఎంతవరకు ఆక్రమణకు గురైంది, మిగిలి ఉందా అనేది తేలనుందా అనే చర్చ సాగుతోంది.

‘ఎల్లంపల్లి’ గేట్ల ఎత్తివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు కడెం ప్రాజెక్ట్ నుంచి వరదనీరు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుతోంది. వరద పరిస్థితిని అంచనా వేస్తూ అధికారులు శనివారం నాలుగు గేట్లు ఎత్తి 22 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్ట్ నీటి మట్టం 20.175 టీఎంసీలకు గాను 19.455 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో 22 వేల క్యూసెక్కులు ఉండగా, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 320 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నాలుగు గేట్లు ఎత్తి 22 వేల క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి వదులుతున్నారు.



భీమారంలో గొల్లవాగు ప్రాజెక్టు మత్తడి

గొల్లవాగు ప్రాజెక్ట్ మత్తడి

భీమారం: భీమారం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ మత్తడి పడుతోంది. శనివారం పూర్తి స్థాయిలో నీరు చేరడంతో మత్తడి పై నుంచి వరద ప్రవహించింది. నెల రోజులు ఆలస్యంగా భారీగా నీళ్లు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 155.00 మీటర్లకు చేరింది. పంటలకు నీటి విడుదలకు ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు.

గుట్టలపై నుంచి వరద

ప్రాజెక్ట్ వరద కాలువ సమీపంలోని గుట్టల నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో జలపాతాన్ని తలపిస్తోంది. రెండేళ్ల క్రితం ప్రాజెక్ట్‌లోకి పూర్తి స్థాయి నీటి మట్టం చేరిన సమయంలో గుట్టలపై నుంచి నీరు కిందికి జాలువారుతూ కనిపించింది. శనివారం ఆ దృశ్యాన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

మాతృ మరణాలు లేకుండా చూడాలి



సమావేశంలో డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రసవ సమయాల్లో మాతృ మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మే 19న జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలో గర్భిణి వై.శ్రీలత, అదే నెల 20న వేమనపల్లి పీహెచ్‌సీ పరిధిలోని జాజులపేట్ గ్రామానికి చెందిన పల్లె లలిత మృతిచెందారని అన్నారు. ఆ రెండు మరణాలపై ఆశా, ఏఎన్ఎం, సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించి, మాతృ మరణాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతీ గర్భిణికి కేసీఆర్ కిట్ పోర్టల్‌లో నమోదు చేయించాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టులతో స్కానింగ్, వైద్యం అందించేలా చూడాలని తెలి పారు. అత్యవసర వైద్యానికి 108 అంబులెన్స్‌లు, గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించేందుకు 102 అమ్మఒడి అంబులెన్సు వాహనాలను వినియోగించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్వేత, డాక్టర్ రాజేశ్, గైనకాలజిస్టు డాక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకులం ఖాళీ

- 640మంది విద్యార్థులు ఇంటిబాట
- జూన్ 24న ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు
- వసతుల్లేక.. డంపింగ్‌యార్డు పొగతో ఇబ్బందులు



డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ



కళాశాల ఏర్పాటు చేసిన ఫంక్షన్‌హాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీ(బాలుర) విద్యార్థులు ఇంటిబాట పట్టడంతో ఖాళీ అయింది. సరైన వసతులు లేకుండానే ఈ ఏడాది జూన్ 24న స్థానిక ఆండాళమ్మ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌ను గురుకుల పాఠశాలకు అద్దెకు తీసుకున్నారు. మౌలిక వసతులు కల్పించలేదు. గత నెలలో భారీ వర్షాలకు గదులు, డైనింగ్‌హాల్‌లోకి వరద నీరు చేరింది. తలుపులు, కిటికీలు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం, తాత్కాలిక గదుల్లో వర్షపు జల్లులు రావడంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. భవన యజమాని పట్టించుకోకపోవడంతో విద్యార్థుల అవస్థలు చూడలేక అధికారులు సెలవులు ఇచ్చి ఇళ్లకు పంపించారు. కొద్ది రోజులకు 640మంది విద్యార్థులకు గాను 200 రాగా.. అప్పటికీ సమస్యలు తీరలేదు. దీంతో తల్లిదండ్రులు ఒక్కొక్కరిగా ఈ నెల 14న వరకు అందరినీ తీసుకెళ్లారు. దీంతో 5వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా బోధన చేస్తున్నారు.

పట్టించుకునే వారెవరు..?

సాంఘిక గురుకుల పాఠశాలను 2016లో మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. రెండేళ్ల నిర్వహణ తర్వాత, సరైన వసతులు లేక చెన్నూరు నియోజకవర్గపరిధిలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధి గద్దెరాగడిలో ఉన్న మరో అద్దె భవనంలోకి మార్చారు. పాఠశాల నుంచి జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్‌గా కావడం, ఏ నియోజకవర్గానికి సంబంధించిన కళాశాల అక్కడే ఉండాలని ఇంటర్ బోర్డు తెలపడంతో హడావుడిగా మంచిర్యాల పట్టణంలోని ఆండాళమ్మ కాలనీలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులోని గదులను అద్దెకు తీసుకుని మార్చారు. వసతుల కల్పనలో అధికారులు గానీ భవన యజమాని గానీ శ్రద్ధ చూపలేదు. మౌలిక వసతులు లేక, మున్సిపల్ డంపింగ్ యార్డు దుర్వాసన, చెత్తను కాల్చడం వల్ల వెలువడుతున్న పొగతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. వర్షాలతో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. స్వంత భవనాన్ని నిర్మిస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఉండవని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మరో భవనంలోకి మారుస్తాం

గురుకులాన్ని మంచిర్యాలకు ఈ ఏడాది జూన్ 24న మార్చాం. వర్షాలు కురవడంతో ఆ భవనంలో ఉన్న సమస్యలు బయటపడ్డాయి. 5వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు 640 మంది విద్యార్థులు ఉండడంతో వారికి సరిపోయే భవనాలు అద్దెకు దొరకడం కష్టంగా ఉంది. ఇటీవల ముల్కల్లలో ఓ భవనం పరిశీలించాం. త్వరలోనే అనుమతులు వస్తే అక్కడికి మారుస్తాం. 5 నుంచి ఇంటర్ వరకు ఆన్‌లైన్ ద్వారా తరగతులను నిర్వహిస్తున్నాం. – మోహన్, ప్రిన్సిపాల్

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



శిక్షణలో పాల్గొన్న యువతతో అధికారులు

పాతమంచిర్యాల: యువత వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుని జీవితంలో స్థిరపడాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంకల్ప్ స్కీంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ ప్రొడక్టివిటీ కౌన్సిల్ నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు వృత్తినైపుణ్యాలు పెంపొందించుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని అన్నారు. స్వయం ఉపాధి శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. సంకల్ప్ తెలంగాణ రీజియన్ కో ఆర్డినేటర్ సత్యం, ఎంజీఎన్ఎఫ్ డాక్టర్ వివేకవర్ధిని, యంగ్ ప్రొఫెషనల్ అమిత్‌పటేల్, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కలదాడిలో వృద్ధురాలికి గాయాలు


గాయపడిన మల్లమ్మ

ఆసిఫాబాద్‌అర్బన్‌: మండలంలోని బురుగూడ గ్రామానికి చెందిన వృద్ధురాలు మల్లమ్మపై శనివారం వీధికుక్కలు దాడిచేయడంతో గాయాలయ్యాయి. ఉదయం ఇంటిముందు వాకిలి ఊడుస్తుండగా ఒక్కసారిగా కుక్కలగుంపు ఆమెపై దాడిచేసింది. సమీపంలో ఉన్న పలువురు కుక్కలను తరిమేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయాలపాలైన వృద్ధురాలిని ఆసిఫాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా కుక్కకాటుకు ఇంజక్షన్లు లేవనిచెప్పడంతో మంచిర్యాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చింతలమానెపల్లిలో బాలునికి..

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో కుక్క దాడి చేసిన ఘటనలో బాలునికి గాయాలయ్యాయి. మడె శంకర్‌ అనే బాలుడు శనివారం పాఠశాలకు వెళ్తుండగా కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య


పోషయ్య (ఫైల్‌)

దండేపల్లి(మంచిర్యాల): మనస్తాపంతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గూడెం గ్రామానికి చెందిన గొర్రె పోషయ్య (42) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఎస్పీ సురేష్‌కుమార్‌ ఆదేశాల మేరకు కెరమెరి మండలంలోని హట్టి గ్రామంలో శనివారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు సీఐ రాణాప్రతాప్‌ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10,400 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఎస్సై సందీప్‌కుమార్‌, కానిస్టేబుళ్లు మధు, రమేశ్‌, సంజీవ్‌ పాల్గొన్నారు.

మృతిచెందిన మేకలకు పంచనామా

కోటపల్లి(చెన్నూర్‌): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఈటెల్లి ధర్మయ్యకు చెందిన 13 మేకలపై శుక్రవారం అడవి కుక్కలు దాడి చేసి హతమార్చాయి. శనివారం పశువైద్యాధికారి పవన్‌ వాటికి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గడ్డం సతీష్‌, జిల్లా అధ్యక్షురాలు పుట్ట లావణ్య మాట్లాడుతూ బాధితునికి రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు.

ఉపాధి లడ్డూ!



ఇతరులపై ఆధారపడకుండా తమకంటూ ఓ గుర్తింపు కోసం ఆదివాసీ మహిళలు ఒక్కటయ్యారు. ఆదివాసీ భీంబాయి సంఘం పేరుతో ఆహార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని ఇప్పపువ్వు లడ్డూల తయారీపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పక్కరాష్ట్రాలకు సైతం ఆర్డర్లపై లడ్డూలను సరఫరా చేస్తున్నారు. ఆదివాసీ మహిళల్లోని రక్తహీనత నివారణకు వీరు తయారుచేసిన ఇప్పపువ్వు లడ్డూ ఎంతగానో దోహదం చేస్తుందని ఐటీడీఏ అధికారుల నుంచి మెప్పు పొందారు. 12 మంది మహిళలు సభ్యులుగా సంఘం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

– ఉట్నూర్‌రూరల్‌


లడ్డూల తయారీలో ఆదివాసీ మహిళలు

- ఇప్పపువ్వుతో తయారు చేస్తున్న ఆదివాసీలు
- 12 మంది సంఘంగా ఏర్పడిన ఆదివాసీ మహిళలు
- తయారీపై మహారాష్ట్రలో శిక్షణ..
- ఐటీడీఏ సహకారంతో యూనిట్‌ ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాతో పాటు పక్కరాష్ట్రాలకు సైతం సరఫరా

సండే స్పెషల్‌

ఉట్నూర్‌ ఐటీడీఏ సహకారంతో...

2019లో 12 మంది మహిళలు ఐటీడీఏ సహకారంతో ఇప్పపువ్వు లడ్డూ తయారీకి కావాల్సిన పరికరాలకు రూ.14 లక్షల యూనిట్‌తో సామగ్రిని కొనుగోలు చేసి ఆదిలాబాద్‌ జిల్లా ఉట్నూర్‌ ఎక్స్‌రోడ్డులోని ఐటీడీఏ పరిశ్రమలో ఆహార కేంద్రాన్ని ప్రారంభించారు. కరోనా సమయంలో తయారీని నిలిపివేసి ప్రస్తుతం తమ వ్యాపారాన్ని మళ్లీ ప్రారంభించారు.

లడ్డూ తయారీ ఇలా..

పోషక విలువలతో కూడిన డ్రైఫ్రూట్స్‌తో పాటు ప్రకృతి ప్రసాదించిన ఇప్పపువ్వుతో ఈ లడ్డూలను తయారు చేస్తున్నారు. ఇప్పపువ్వును ఎండబెట్టి నూనెలో ఫ్రై చేసి ఎండబెట్టిన అనంతరం కిష్‌మిష్‌, బాదం, యాలకుల పొడి, ఇప్పపువ్వు, పల్లీలు, బెల్లం కలిపి లడ్డూలను తయారు చేస్తారు. వాటిని ఆదిలాబాద్‌ న్యాచురల్‌ దుకాణాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌ జిల్లాకు సైతం సరఫరా చేస్తున్నారు. ఆర్డర్లపై తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. క్వింటాల్‌ లడ్డూలకు రూ.20 నుంచి 25వేల వరకు ఆదాయం వస్తుందని వారు పేర్కొంటున్నారు. వీటి తయారీ కోసం మహారాష్ట్రలోని యవత్‌మాల్‌ జిల్లాలో మూడు రోజుల పాటు శిక్షణ సైతం తీసుకున్నారు.

ఉపాధి మార్గం దొరికింది..

ఖాళీగా ఉండకుండా గ్రూపుగా ఏర్పడి లడ్డూల తయారీని ఎంచుకున్నాం. ఐటీడీఏ సహకారంతో సామగ్రిని కొనుగోలు చేసి లడ్డూ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మేము చేస్తున్న లడ్డూలు ఎంతో పోషక విలువలతో కూడినవి. అధికారులు గుర్తించి లడ్డూలను అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అందించాలి. చిన్నారులకు, రక్తహీనత ఉన్న వారికి మంచి ఫలితాలు వస్తాయి.

– బాగ్‌బాయి, ఆదివాసీ భీంబాయి సంఘం అధ్యక్షురాలు

మంచి పోషకాహారం



పోషక విలువలతో కూడిన పదార్థాలతో ఈ లడ్డూలు తయారు చేస్తున్నాం. రక్తహీనత నివారణకు ఎంతగానో దోహదపడుతాయి. మేము తయారుచేసిన లడ్డూలను ప్రతిఒక్కరూ మెచ్చుకుంటున్నారు. లడ్డూలను ఆదిలాబాద్‌, అనంతపూర్‌ నుంచి ఆర్డర్లతో పాటు ఎవరైనా ఆర్డర్‌ ఇస్తే తయారు చేసి అందిస్తున్నాం. కిలో లడ్డూలకు రూ.400 చొప్పున విక్రయిస్తున్నాం.

– మెస్రం గంగుబాయి, సంఘం సభ్యురాలు

పైలట్‌ ప్రాజెక్ట్‌గా...

ఈ లడ్డూలను పరిశీలించిన అధికారులు పైలట్‌ ప్రాజెక్టు కింద గర్భిణులకు పంపిణీ చేయాలని ఆదిలాబాద్‌, కుమురంభీం జిల్లాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్‌లో 150 మంది, కుమురంభీం జిల్లాలో 150 మంది గర్భిణులకు ఈ లడ్డూలను కలెక్టర్‌, ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇవి రక్తహీనత నివారణకు ఎంతో దోహదపడ్డాయని గుర్తించారు.


ఉట్నూర్‌ ఎక్స్‌రోడ్డులోని ఆదివాసీ ఆహార కేంద్రం



లడ్డూ తయారీకి సిద్ధం చేసిన ఇప్పపువ్వు, నువ్వులు, పల్లీలు


విక్రయానికి సిద్ధంగా ఇప్పపువ్వు లడ్డూలు

విద్యతోనే సర్వతో ముఖాభివృద్ధి


మాట్లాడుతున్న అడిషనల్‌ కలెక్టర్‌ మోతీలాల్‌

మంచిర్యాలఅర్బన్‌: విద్యతోనే సర్వతో ముఖాభివృద్ధి జరుగుతుందని, ముఖ్యంగా మహిళా విద్య కుటుంబాన్ని, జీవన విధానాన్ని సమూలంగా మారుస్తుందని జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ మోతీలాల్‌ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మకాలనీలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు మూల్యాంకనం (పరీక్ష) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు, అల్లికలకు మంచి ఆదరణ ఉందని, నైపుణ్యం పెంచుకుంటే స్వయం ఉపాధి పొంది ఆర్థిక స్థితిని పెంచుకోవచ్చన్నారు. అక్షరాస్యతతో పాటు కుట్టు శిక్షణ అందిస్తున్న వయోజనశాఖను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌, రిటైర్డు ఉపసంచాలకుడు వీరేశం, డీఆర్పీలు ప్రకాశ్‌, వెంకటేశ్వర్లు, శాంకరి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో విద్యార్థుల సత్తా


క్రీడాకారులతో ప్రిన్సిపాల్‌ సంతోష్‌

బెల్లంపల్లి: పట్టణంలోని కాసిపేట గురుకులంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్‌–14 విభాగంలో నిర్వహించిన 600 మీటర్ల పరుగు పందెం పోటీల్లో బి.అనిల్‌ బ్రాంజ్‌ మెడల్‌, అండర్‌–16 విభాగంలో జరిగిన 2 వేల మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ఆర్‌.వివేకవర్ధన్‌ గోల్డ్‌మెడల్‌, అండర్‌–18 విభాగంలో 3వేల మీటర్ల పరుగు పందెంలో డి.సాయికిరణ్‌ గోల్డ్‌ మెడల్‌, 800 మీటర్ల పరుగు పందెం పోటీలో బ్రాంజ్‌ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. అండర్‌–20 విభాగంలో ఎస్‌.రవితేజ 800 మీటర్ల పరుగుపందెంలో గోల్డ్‌మెడల్‌, 5వేల మీటర్లలో ఎ.అరవింద్‌ సిల్వర్‌ మెడల్‌, 800 మీటర్లలో బ్రాంజ్‌ మెడల్‌ సాధించారు. ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్మీ బాయ్స్‌ స్పోర్ట్స్‌ కంపెనీలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ప్రిన్సిపాల్‌ సంతోష్‌కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ స్రవంతి, విద్యార్థులను అభినందించారు.

బెల్లంపల్లి కేవీకేకు జోనల్‌స్థాయి అవార్డులు



అవార్డు అందుకుంటున్న రాజేశ్వర్‌నాయక్‌

బెల్లంపల్లి: వ్యవసాయరంగాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు పరిచయంచేసి ప్రోత్సహిస్తున్న బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి నాలుగు జోనల్‌స్థాయి అవార్డులు వరించాయి. కోయంబత్తూర్‌లోని వ్యవసాయ వర్శిటీలో ఈ నెల 17 నుండి 19 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలోని 79 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్‌ సమావేశాలు నిర్వహించారు. గతేడాది బెల్లంపల్లి కేవీకే నిర్వహించిన పలు అంశాలను సమావేశాల్లో ప్రదర్శించారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా నూనెగింజల సాగును ప్రోత్సహించేలా నిర్వహించిన సామూహిక క్షేత్ర ప్రదర్శనలకు, చేపల పెంపకంపై ఏర్పాటు చేసిన నమూనా క్షేత్రాలకు, వ్యవసాయ సాంకేతికతను ప్రతిబింబించేలా తీసిన ఛాయా చిత్రానికి అవార్డులు దక్కినట్లు బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ ఎం.రాజేశ్వర్‌ నాయక్‌ తెలిపారు. ఈమేరకు ఆయన అవార్డులను అందుకున్నారు.

బాలిక గర్భానికి కారణమంటూ వ్యాపారి నుంచి వసూలు..?

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆదివాసీ బాలిక గర్భం దాల్చడానికి కారణమంటూ వ్యాపారి వద్ద మరో గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, పార్టీ నాయకులు డబ్బులు వసూలు చేశారనే విషయం చర్చనీయాంశమైంది. గ్రామంలోని వ్యాపారి ఇంట్లో బాలిక పని చేస్తోంది. తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చిందని, వ్యాపారి కారణమని బెదిరించి అతడి నుంచి రూ.2లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించి గర్భం లేదని వైద్యులతో నిర్ధారణ చేయించారు. వ్యాపారికి సంబంధం లేదంటూ సదరు ప్రజాప్రతినిధి బాండ్‌ పేపర్‌పై గ్రామస్తులతో సంతకం చేయించే ప్రయత్నం చేయగా స్థానికులు నిలదీయడంతో వెళ్లిపోయినట్లు తెలిసింది.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన

మంచిర్యాలఅర్బన్‌: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా సైన్స్‌ సెంటర్‌కు చెందిన జిజ్ఞాన సంచార విజ్ఞానశాల ఆధ్వర్యంలో సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెంటర్‌ ఇన్‌స్ట్రక్టర్‌ సాయికుమార్‌ మాట్లాడుతూ సైన్స్‌లోని వివిధ అంశాలను ప్రత్యక్షంగా చూపడం ద్వారా విద్యార్థులకు నేర్చుకోవాలన్న ఆసక్తి పెరుగుతుందన్నారు. నేర్చుకున్నదని ఎక్కువ కాలం గుర్తుండేలా సంచార విజ్ఞానశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సైన్స్‌ ఉపాధ్యాయురాలు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

‘బీసీలకు 34 సీట్లు ఇవ్వాలి’


గాంధీభవన్‌ వద్ద డాక్టర్‌ నీలకంఠేశ్వర్‌

మంచిర్యాలటౌన్‌: ఉదయ్‌పూర్‌ డిక్లరేషన్‌ ప్రకారం బీసీలకు 34 సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్‌ నాయకుడు డాక్టర్‌ నీలకంఠేశ్వర్‌ సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం జరిగిన ఓబీసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఎంపీ నియోజకవర్గంలో రెండు ఎమ్మెల్యే సీట్లు బీసీలకు ఇవ్వాలని ఉదయ్‌పూర్‌ డిక్లరేషన్‌ ద్వారా చెప్పడం జరిగిందని, కానీ ఎక్కువ మంది బీసీలు ఉండడంతో మూడు సీట్లు ఇవ్వాలని వక్తలు సూచించినట్లు తెలిపారు. సమావేశంలో మంచిర్యాల నియోజకవర్గం నుంచి వంగల దయానంద్‌, సత్యనారాయణ, కొట్టె లచ్చన్న, శ్రీనివాస్‌గౌడ్‌, శేఖర్‌, జ్ఞానేశ్వర్‌ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌


బైక్‌ ర్యాలీలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

కాగజ్‌నగర్‌టౌన్‌: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ పిలుపునిచ్చారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా శనివారం పట్టణంలో భారీ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వాసవీ గార్డెన్స్‌లో మైనార్టీ నాయకుడు షబ్బాఖాన్‌ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ సిర్పూర్‌ పేపర్‌ మిల్లు కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చే రూ.35 వేల బోనస్‌ వడ్డీతో సహా సెప్టెంబర్‌ 5లోగా చెల్లించాలని, లేనిపక్షంలో కార్మికులతో కలిసి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కేసీఆర్‌ ప్రభుత్వ హయాంలో ప్రతీ పేద కుటుంబానికి అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ తాలుకా ఇన్‌చార్జి అర్షద్‌ హుస్సేన్‌, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ పిల్లల తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగాల్‌పేటకు అధికారుల పరుగులు

- ‘గృహలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన పూర్తి

సాక్షి ఎఫెక్ట్‌..


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

నెన్నెల(బెల్లంపల్లి): జంగాల్‌పేటలో ‘గృహలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన ఎట్టకేలకూ పూర్తయ్యింది. ‘గృహలక్ష్మి’కి జంగాల్‌పేట దూరం’ అనే శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్‌, ముగ్గురు కార్యదర్శులు, మరో ముగ్గురు టీఏలు గ్రామానికి పరుగులు పెట్టారు. ఈ నెల 20లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సి ఉండగా జంగాల్‌పేటలో సర్వేనే ప్రారంభం కాకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందారు. విషయాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తేవడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. గడువులోగా సర్వే జరిగేలా చూసిన ‘సాక్షి’కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.


తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి కేంద్రీకరించాలి

- జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్‌ అధికారి శ్రీనివాస్‌


మాట్లాడుతున్న సెక్టోరియల్‌ అధికారి శ్రీనివాస్‌

భీమారం(చెన్నూర్‌): తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్‌ అధికారి పి.శ్రీనివాస్‌ కోరారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో చదువుకున్న పాఠ్యాంశాలను ఇంట్లో ప్రత్యేక గదిలో ఉంచి చదివిస్తే విద్యార్థులకు మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్‌తో కలిసి సహపంక్తి భోజనం ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌ రావు, విద్యాకమిటీ చైర్మన్‌ సత్యనారాయణ, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దిగివచ్చిన టమాటా



మంచిర్యాలఅగ్రికల్చర్‌: టమాట డబుల్‌ సెంచరీ నుంచి ఆఫ్‌ సెంచరికి చేరింది. మొన్నటి వరకు కిలోకు రూ.200 ధర పలుకగా ప్రస్తుతం రూ.50కి చేరడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ఆరంభంలో వేసుకున్న పంట దిగుబడి వస్తుండడంతో వారం రోజులుగా రూ.80 నుంచి 50 వరకు ధర తగ్గుతూ వస్తోంది.

టెలీగ్రామ్‌ లింక్‌తో మోసం

- రివ్యూస్‌ పంపిస్తే డబ్బులు ఇస్తామంటూ మెసేజ్‌
- రూ.5.28 లక్షలు నష్టపోయిన మహిళ

రామకృష్ణాపూర్‌(చెన్నూర్‌): తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశపడిన ఓ మహిళ రూ.5.28 లక్షలు నష్టపోయింది. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్సై అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ మహిళ మంచిర్యాలలో ప్రైవేట్‌ లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఇటీవల ఆమెకు తన స్నేహితుల ద్వారా టెలీగ్రామ్‌లో ఓ లింక్‌ వచ్చింది. రివ్యూస్‌ పంపిస్తే డబ్బులు వస్తాయంటూ లింక్‌లో నమ్మబలికారు. తొలుత ఆమె పంపిన రివ్యూస్‌కు కొన్ని డబ్బులు కూడా వచ్చాయి. అయితే దీనిని పార్ట్‌ టైం ఇన్‌కాంగా భావించిన మహిళ మరిన్ని రివ్యూస్‌లు పంపించడం ప్రారంభించింది. ఆ తర్వాత డబ్బులు పంపాలంటే కొంత డబ్బు డిపాజిట్‌ చేయాల్సి ఉంటుందని చెప్పడంతో కొంతడబ్బు బ్యాంకు ఖాతాలో డిపాజిట్‌ చేసింది. పంపిన డబ్బుకు అధికంగా డబ్బులు తిరిగి రావటంతో మరిన్ని డబ్బులు వస్తాయన్న ఆశతో వేర్వేరు అకౌంట్లకు డబ్బులు పంపించటం ఆరంభించింది. ఈ నెల 5, 6 7 తేదీలలోనే మొత్తం తొమ్మిది వేర్వేరు బ్యాంకు అకౌంట్లకు ఏకంగా రూ.5లక్షల 28 వేలు పంపించింది. తిరిగి డబ్బులు రాకపోవడంతో ఏదో మోసం జరిగిందని భావించి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అప్పటికే డబ్బును వినియోగించుకున్న సైబర్‌ నేరగాళ్ల నుండి ఒక ఖాతాలో ఉన్న రూ.20 వేలను ఫ్రీజ్‌ చేసినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పార్శిల్‌ సర్వీస్‌ పేరిట..

- రూ.18,480 నష్టపోయిన బాధితుడు
- పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు

మందమర్రిరూరల్‌(చెన్నూర్‌): పార్శిల్‌ సర్వీస్‌ పేరిట తనకు మోసం జరిగిందని పట్టణానికి చెందిన గజ్జనాల శ్రీనివాస్‌ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు గతేడాది జూన్‌ 27న మీ షో పార్శిల్‌ సర్వీస్‌ పేరుతో గుర్తు తెలియని వ్యక్తి కాల్‌చేసి మీకు తప్పుడు పార్శిల్‌ వచ్చిందని ఎస్బీఐ డెబిట్‌కార్డు వివరాలు తెలియజేస్తే రిఫండ్‌ చేస్తామని చెప్పాడు. అతని మాటలు నమ్మి వివరాలు చెప్పడంతో రూ.4,900లు కట్‌ అయ్యాయి. మోసపోయానని గ్రహించిన బాధితుడు మీ షో కస్టమర్‌ కేర్‌ సెంటర్‌కి ఫిర్యాదు చేయగా క్రెడిట్‌ కార్డు నంబర్‌ తెలియజేస్తే ఒక అప్లికేషన్‌ పంపిస్తాం దాన్ని స్కాన్‌ చేస్తే మీ డబ్బులు రిఫండ్‌ అవుతాయని చెప్పి అప్లికేషన్‌ పంపించారు. అప్లికేషన్‌ స్కాన్‌ చేయగా మళ్లీ రూ.13,580 కట్‌ అయ్యాయి. మళ్లీ మోసపోయానని గ్రహించిన శ్రీనివాస్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి వివరాలు చెప్పవద్దని, ఎవరైనా సైబర్‌ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్‌ చేయాలని సీఐ సూచించారు.